# పశ్చాత్తాపం

-సత్యవాడ సోదరీమణులు

"భగవంతుడ్ని మనసారా చూడండి. ఏడుకొండలవాడి సన్నిధిలో ఉన్నాం మనమిప్పుడు. ఆ కలియుగ దైవం దివ్యరూపంతో ఎలా వెలిగిపోతున్నాడో'' భర్తనే దైవ సమానంగా భావించే షీలా, శ్రీధర్‌ని అపురూపంగా చూస్తూ చెప్పింది.

"ఏమిటో షీలా అంతా నీ పిచ్చి. నువ్వొక్కదానివే వెళ్లొచ్చేయ్ అంటే విన్నావా. నన్నూ లాక్కొచ్చావ్. ఎంత శ్రమపడ్డావు. నేను చేసేదేముంది ఈ చూపులేని కళ్లతో'' నిట్టూర్చాడు.

"మీ పవిత్రమైన హృదయం ముందు మా బాహ్యమైన కంటి చూపెంత? మనం అమ్మానాన్నలమై బిడ్డనెత్తుకుని నీ సన్నిధికి రావాలని మనసారా మీరూ మొక్కుకోండి. మీలాంటివాళ్లంటేనే ఆ స్వామికి అమిత ప్రేమ''

"నిజమే షీలా! నేను కోరుకోకుండానే మహత్తరమైన వరాన్ని అనుగ్రహించాడు. నీలాంటి పుణ్యమూర్తిని నా సహచరిణిని చేసాడు'' చేతులు జోడించి అన్నాడు తన్మయత్వంగా.

"ఇక్కడ ముచ్చట్లేమిటమ్మాయ్! అటు చూడు. ఎంతమంది క్యూలో నిలబడిపోయారో. ఆయన్ని తీసుకుని తొందరగా కదులు'' ఆ హెచ్చరింపుతో భర్త చేయి అందుకుని నడిచింది.

ఆ దృశ్యాన్ని చూస్తున్న నీలవేణి రెప్పవేయడం మరచిపోయింది.

ఆమెను చూడగానే ఉలిక్కిపడింది షీలా.

"హాయ్ నీలూ! భలేగా కలిసామే. నువ్వొ కొండకొచ్చావా? నీకు పెళ్లయినట్లు తెలిసింది. మరి మీవారేరి?'' స్నేహితురాల్ని ఆత్రంగా పలకరించింది.

"నా మాటకేం షీలా! మీ జంట చూడముచ్చటగా ఉన్నారే''

"పరిహాసమా?''

'లేదే. మనస్ఫూర్తిగా అంటున్నాను''

"ఏమోలే వ్యంగ్య సంభాషణలు నీకు అలవాటేగా?''

"నీలా! అయిందా నీ దర్శనం? ముందు కారెక్కి కూర్చో' యాత్రికులతో కిక్కిరిసివున్న జీపును ఆపించాడు.

ఇతగాడే అన్నమాట నీలవేణి భర్త. కోరుకున్నంత మగసిరి ఉన్నవాడ్నే చేసుకుందే. ఉంగరాల జుట్టు, ఆ మీసకట్టు, పొడవుకు తగ్గ లావు, అందమైన ముఖానికి మరింత అందాన్నిచ్చే చక్కని కళ్ళు... ఒక్కక్షణం పరిశీలనగా చూసి అనుకుంది షీల.

"షీలా! మీ కాటేజ్ నెంబర్ చెప్పవే. నేనొస్తాను. మనం కలుసుకున్న మరుక్షణమే విడిపోవడం బాగాలేదు'' వాళ్ళు వుంటున్న హోటల్ నెంబర్ రాసుకుని జీపెక్కింది.

ఏడుకొండల పై నుంచి అతివేగంగా క్రిందికి దిగిపోతుంది ప్రయాణికుల్ని తనలో ఇముడ్చుకున్న జీప్. కొండంత అదృష్టాన్ని కాలదన్నుకుని తనూ ఇలానే జీవితంలో దిగజారిపోలేదు అనుకుంది నీలవేణి.

"ఏవిటా పరధ్యానం. నీ పవిత్ర దర్శన సమయంలో నాకన్నా అందగాడో ఏ ఓల్డ్‌గోల్డ్ ఫ్రెండో కనబడి కన్నుకొట్టాడా'' భార్యను చిరాగ్గా చూస్తూ అన్నాడు శంకరం.

తను ఏ పనిచేసినా ఇలానే మాటలతో హింసించడం అతనికి పరిపాటే. నీలవేణి అన్నింటికీ అలవాటు పడిపోయింది.

పట్టపగలే పొట్టనిండా మద్యం పట్టించే అతనితో మాట్లాడి ప్రయోజనం లేదని ఏనాడో అర్థమైంది ఆమెకు. అతనలాగే తన ధోరణి కొనసాగిస్తున్నాడు.

నీలవేణి చెవులకవి సోకనివ్వడం లేదు. తన భర్త అన్నది నిజమే. తను చేజార్చుకున్న అమూల్యమైన ప్రేమనిధి బంగారమే. మైకంతోనే అన్నా శంకర్ మాట అక్షరసత్యం. తన గతాన్ని నెమరేసుకోసాగింది.

★ ★ ★

ఆరేళ్ళ క్రితం ఈ శ్రీధర్‌ని తనకు చూపించారు అమ్మా,మావయ్యా.

"కళ్ళొక్కటి లేవుగానీ మంచి స్థితిమంతుడమ్మా. నీలో రవంత త్యాగబుద్ధి కాసింత సేవాగుణం ఉంటే పిల్లాపాపలతో కళకళలాడుతూ జీవితాంతం సుఖపడతావ్''

"మామయ్య అన్నది నిజమే తల్లి మన పరిస్థితులను బట్టి ఇంతకన్నా మంచి సంబంధానికి తూగలేం. అంధుడైనా ఈ అబ్బాయి చాలా మంచివాడు'' అమ్మమాట పూర్తికాకుండానే తను గయ్యిన లేచింది. బుసలు కొట్టే అహంకారంతో ఎదురుతిరిగింది.

"నా బాగుకోరి చాలా గొప్ప ఆలోచనలు చేస్తున్నారు. నాకేం తక్కువని కుంటివాడ్ని గుడ్డివాడ్నీ కట్టుకోవాలి. మన పేదరికాన్ని, దరిద్రాన్ని అలుసుగా తీసుకుని ఆ కళ్ళులేని కబోధి నన్ను చేసుకుంటానంటాడా. అతగాడికున్నదల్లా మనకు లేని డబ్బు. ఏ ముఖం పెట్టుకుని ఆ మహానుభావుడు అడిగాడు. దానికి మీరెలా సై అన్నారు. పెళ్లికాకపోతే ఇలాగే దర్జాగా బతికేయగలను గానీ నా ఆశలూ, కోరికలూ బూడిదలో పోసిన పన్నీరు చేసుకోను'' విసురుగా అంటున్న నీలవేణిని చూసి ఆశ్చర్యపోవడం ఆ అన్నాచెల్లెళ్ల వంతైంది.

"ఈ మొండిఘటం మనకు లొంగదని నేనప్పుడే చెప్పానుకదన్నయ్యా. నావంట్లో ఓపిక ఉన్నంతకాలం ఏవో పనిపాటలు చేసి పోషిస్తాను. ఏదో వంకన ఇల్లు పట్టకుండా రేపేమిటి అనే ఆలోచనే లేకుండా తిరుగుతూ ఉంటుంది'' కూతురి వైఖరికి కుమిలిపోయింది జానకమ్మ. నీలవేణి ఉక్రోషం పట్టలేకపోతోంది.

"తగుదునమ్మా అని ఇలాంటివాళ్లందరికీ పెళ్ళిళ్ళు సంసారాలు కావాలా? భార్యల్ని ఏం సుఖపెట్టగలరని వాళ్లతో పాటు బ్రతుకంతా ఆ అవకరాన్ని వీళ్ళూ మోసుకు తిరగాలి. ఆ కుంటితనమో గ్రుడ్డితనమో, చెవుడూ, మూగ ఏదో ఒక శాపంగా బ్రతుకీడుస్తున్న వాళ్ళు ఇలాంటి ఆశలు పెంచుకోవడం ఏం న్యాయం. ఒక దెబ్బ తింటే తప్ప ఇలాంటివాళ్లకి తెలిసిరాదు'' ఓ వారం గడిచినా నీలవేణిలో ఇవే తలపులు. ప్రాణస్నేహితు

రాలు షీలా అమెరికాలో ఎంఎస్ పూర్తిచేసుకుని రావడంతో తన భావోద్రేకానికి ఓ ఆకృతి ఇచ్చింది.

"ఏవిటి నీలూ! విషయం చెప్పకుండానే ఈ సస్పెన్స్. ఇంతకీ ఏవంటావ్? నీ ప్రతీకార వాంఛ ఎవరిమీద. ఇంత పెద్ద ఆఫీసులో పనిచేస్తున్న ఆ ప్రబుద్ధుడు ఏరకంగా నిన్ను అవమానించాడు. నాకేం అంతుపట్టడం లేదేబాబు" గేట్ ముందు నిల బడి తనతోపాటు నిరీక్షిస్తున్న షీలా అంది.

"ఒక్క నిముషం ఓపిక పట్టు. ఉద్యోగులంతా బయటకు వచ్చేస్తున్నారుగా. అతగాడూ వస్తాడు" నీలవేణి అంటుండగానే నెమ్మదిగా కర్ర శబ్దం చేసు కుంటూ బ్యాంకునుంచి బయటకు వస్తున్న శ్రీధర్‌పై పడ్డాయి షీలా చూపులు.

అబ్బ ఎంత ఆత్మవిశ్వాసం అనుకుంటూ "ఆ స్టిక్ విడిచిపెట్టండి సర్. మీరు ఎటు వెళ్లాలి" అతని చేయి అందుకుంది.

"వద్దులేండి. నన్ను వెళ్లనివ్వండి. ప్రతిరోజూ ఇక్కడికి వచ్చి వెళుతుంటానుగా" మృదువుగా బదులిచ్చి చకచకా వెళ్లిపోతున్న అతన్ని ఆశ్చ ర్యంగా చూసింది షీలా.


"అసలు నీకు మతుందా! అతనికి చెయ్యి అంది స్తావేమిటి? ఎంత దర్పమో చూశావుగా. ఇతనే నా మనసులో కసిరేపాడు. మనం గుణపాఠం చెప్పవల సింది ఇతడికేనే" అంటూ విషయం అంతా స్నేహి తురాలి ముందుంచింది.

"ఇంకా నయం. నీ నోటికి వచ్చినట్టు అని పాపం అతని మనసుని గాయపర్చావు కాదు. ఎంత కుసంస్కారంగా ప్రవర్తిస్తున్నావే" కాస్త మందలింపుగా అంది.

"మహారాజని మనవి చేసుకుంటే మరి రెండు తగిలించమన్నాడన్నట్టు బాగుంది నీ వరస"

"కాకపోతే ఏవిటి నీలూ. ఏదో లోపం ఉన్నంత మాత్రాన వాళ్లకీ ఏ కోరికలూ ఉండకూడదంటావా. ఆ సంస్కారం నీలో ఉందని మీ మామయ్య పొరప డ్డారు. నీ అభిప్రాయాలు వేరయినంత మాత్రాన వికలాంగులని తప్పుపట్టకు. నిన్నెవరూ బలవంతం చేయలేదుగా. అతనికి నువ్వు గుణపాఠం చెప్పేదే ముంది"

స్నేహితురాలి ధోరణికి మండిపడింది నీలవేణి. "నీవు బంగారుపిచ్చుకవు కనక ఎన్ని కబుర్లయినా చెబుతావు. నాన్న పోవడం, అన్నయ్య మమ్మల్ని పట్టించుకోకుండా వేరెళ్ళిపోవడంతో నా పెళ్ళే అమ్మవాళ్లకి ఓ పెద్ద సమస్య. ఎలా అయినా నా పీడ వదిలించుకోవాలి అని చూస్తున్నారు. నీకి లాంటి సాధక బాధకాలు ఎందుకెదురవుతాయి. నా



స్థానంలో నిన్నూహించుకో ఒక్కసారి. అతడికే కాదు నీ కన్నతల్లికి కూడా గుణపాఠం చెప్పేస్తావ్''

"అలా అనుకుంటున్నావా! ఇక నీతో మాటలు అనవసరం. నీకూ నీ స్నేహానికీ ఓ నమస్కారం'' అంటూ షీలా ఇప్పుడు ఇలా తటస్థపడింది.

ఆరోజు అందించిన చేయి విడవలేదన్నమాట. అతని సహచరియై తన గొప్ప మనసుతో అతని కంటివెలుగుగా మారి కలలు పండించిందన్నమాట. అమ్మనూ మామయ్యనూ దుఃఖపెట్టి మేకవన్నె పులితో ఏడడుగులూ నడిచింది. తన పెళ్లికోసం అమ్మకంటూ మిగిలిన ఒకే ఒక్క ఆధారం ఇల్లు అమ్మించి ముచ్చట్లన్నీ తీర్చుకుని అత్తవారింటికెళ్లింది. తను పొందిందేంటి? తననుకున్నట్టు రూపంలో మన్మథుడే. కళ్లతో కవ్విస్తూ సరసరాగాలలో తేల్చడమా! భార్య అవసరం కామవాంఛలు తీర్చుకోవడానికే అన్నట్టు ఇల్లాలంటే ఇంటెడు చాకిరీ చేస్తూ కుక్కిన పేనులా పడి ఉండడమే అన్నట్టు ప్రవర్తిస్తాడు. తనాశించిన సుఖాలేవీ దక్కకపోగా అతనితో తన బ్రతుకే ఓ నరకమైంది.

## దొంగలు చేసిన సాయం

అర్జెంటీనాలో రోసారియోలో ఓ రోజున ఓ కంపెనీ నుంచి 20 టన్నుల ఎరువుని ముగ్గురు దొంగలు ఎత్తుకుపోయారు. అక్కడ్నించి తాము కాజేసిన మొబైల్ ఫోన్‌తో తమ ఫొటోలు తీసుకున్నారు. కానీ ఆ ప్రబుద్ధులకి మొబైల్‌లో ఫోటోలు తీసిన వెంటనే అవి వెబ్ పేజీలోకి వెళ్లిపోతాయని తెలియదు. ఆ ఫొటోల సాయంతో పోలీసులు వాళ్లని పట్టుకున్నారు.


## కారుని కాల్చుకున్న దొంగలు

న్యూజీలాండ్‌లోని ఓ ఫార్మ్ నుంచి దొంగిలించి తమ కారు ట్యాంక్‌ని నింపుకున్నారు ముగ్గురు దొంగలు. అయితే ఆ ఫార్మ్ నుంచి తీసుకున్నది డీజిల్ అని వాళ్లకి తెలియదు. తమ పెట్రోలు ట్యాంక్‌ను నింపుకున్నా కారు స్టార్ట్ కాలేదేమిటని సిగరెట్ లైటర్ వెలిగించి టేంకులోకి తొంగి చూడబోయాడొక దొంగ. అంతే! ఆ ట్యాంకు భగ్గుమని అంటుకుంది. పోలీసులు వచ్చి ఆరాతీసి ఆ దొంగలను అరెస్టు చేసారు.

## స్పిట్ కిట్స్

బ్రిటన్‌లో ఇదివరలో ఏ కారులోంచో ఉమ్మేసి తప్పించుకుపోయే వాళ్లుండేవారు. కానీ ఈమధ్య ట్రాఫిక్ వార్డెన్స్ ఆ ఉమ్మునుంచి శాంపిల్స్ తీసి డిఎన్ఏ టెస్టులు చేసి ఆ నేరస్థుల్ని ఇట్టే పట్టుకుని శిక్షలు విధిస్తున్నారట. దాంతో బ్రిటన్‌లో కారు పార్కింగ్‌వాళ్ళు తమ స్టాఫ్‌కి స్పిట్‌కిట్లు సప్లయ్ చేయనారంభించారు.

-తటవర్తి




తండ్రిగా పిల్లల బాధ్యత తనకవసరం లేదంటాడు. సంపాదించిన డబ్బు అతని వ్యసనాలకే ఖర్చు చేసుకుంటాడు. ఒకటనా రెండనా అన్నీ దురలవాట్లు అతని బంధువులే. ఇంక మమకారానికీ మానవత్వానికీ ఆ మనసులో చోటెక్కడిదీ? ఉండబట్టలేక తనొక్కమాటందో అతని నోటికి హద్దూ అదుపులేకుండా పోతుంది.

"నా ముందు మాట్లాడ్డానికి నువ్వెంతే. ముప్పొద్దులా మెక్కుతూ నీడపట్టున ఉంటున్నావ్. అది చాలదూ. పొదుపు చేసుకుందాం పిల్లల్ని కందాం అంటూ బోడి సలహాలివ్వకు. కూటికీ గుడ్డకూ గతిలేనిదానివి. పోనీపాపం చెప్పినట్టు పడుంటుందిలే అని కట్టుకున్నాను గానీ నెక్కెక్కడా నాగలోకమెక్కడా. నా అందం చూసి మోజుపడ్డదానివి. అణిగీమణిగీ ఉండు'' ఒంటికాలిమీద లేస్తాడు. భర్త తన భావాలు అంత సూటిగా చెప్తున్నప్పుడు, తన స్థానం ఏవిటో క్షణక్షణం గుర్తుచేస్తున్నప్పుడు పెదవి విప్పి మాత్రం ప్రయోజనం ఏముంది. పూలబుట్ట అనుకుని ముళ్లకంపలో తనకు తానే పడింది. కాలం గడుస్తున్న కొద్దీ గుండె బండబారిపోయింది. షీలాశ్రీధర్ దంపతులుగా ఎదురుపడడం పుండుమీద కారం చల్లినట్టే ఉందో, ఆ ఆదర్శమూర్తులకి క్షమార్పణ చెప్పుకునే మంచి అవకాశమే కలిసొచ్చిందో అంతుపట్టని నీలవేణి షీలా శ్రీధర్‌లు తన రూంకే రావడంతో అదిరిపడింది.

"నువ్విలా పిచ్చిచూపులు చూస్తావని నాకు తెలుసు. నువ్వు నన్ను కలుసుకోవడానికి రాలేవని కూడా పసికట్టాను'' చకచకా తనే లోపలికి వచ్చేసి శ్రీధర్‌ని సోఫాలో కూర్చోబెట్టి నీలవేణి చేతిని తన చేతుల్లోకి తీసుకుంటూ మంచం మీద కూర్చుంది షీలా. స్నేహితురాల్ని వాటేసుకుని వెక్కివెక్కి ఏడ్చేసింది నీలవేణి. షీలా ఓదార్పుకి కాస్త తేరుకుని వెక్కిళ్ళ మధ్యలోనే అంది.

"నా గురించి నన్నేమీ అడక్కు. మీరిద్దరూ నన్ను క్షమించానని ఒక్క మాటనండి చాలు. అదే రవంత ఊరట నాకు. వయసు బలుపుతో, తల బిరుసుతో ప్రవర్తించిన నాకు తగినశాస్తే జరిగింది. తప్పటడుగు వేశాక ఏం లాభం? ఈ బంధిఖానా నాకు శాశ్వతం. ఈ బాధలు నన్ను వెన్నంటే ఉంటాయ్. అడగొద్దంటూనే ఏవేవో వాగేస్తున్నాను సారీ''

"ఎందుకే నీలూ ఊరికే ఇదయిపోతావ్. ముందు నువ్వు స్థిమితపడు. మేం క్షమించడానికేముంది కానీ ఆరోజు నువ్వన్నమాటలు నాలో ఎంతో సంచలనాన్ని కలిగించాయ్. మనం ధనవంతులమా పేదవాళ్లమా అన్నది కాదు. జీవితంలో ఒక ఉన్నతమైన పనిచేసి మానవజన్మ సార్థకం చేసుకోవాలి. ఆ ఆశయంతోనే శ్రీధర్‌కు దగ్గరయ్యాను. నువ్ తృణీకరించినందుకే చాలా కృంగిపోయాడేమో నేను మా పెళ్ళి ప్రస్తావన తెచ్చేసరికి ఎంత నిర్వేదంగా మాట్లాడాడో. చివరికి మీమామయ్యే నచ్చచెప్పి ఒప్పించారు. పైకి కనిపించే లోపాన్ని వేలెత్తి చూపించడం సులువే. అంతర్గతమైన మానవస్వభావం అవగతం చేసుకోగలమా. కంటిచూపు లేనివాడని, మీ కుటుంబ పరిస్థితుల్ని అలుసుగా తీసుకున్నాడన్నావే నువ్వు ఏరి కోరి చేసుకున్న ఇతగాడు మాత్రం ఏం చేశాడు. లేని ఇంటినుంచి వచ్చిన దానివని మానసికంగా హింసిస్తున్నాడు. జరిగినదానికి నువ్వు పశ్చాత్తాపపడుతున్నావని కూడా అర్థమైంది. నీకు తగిన శాస్తే అయిందని మేం సంతోషిస్తున్నామా! శంకరంలో మంచి మార్పు రావాలని నిన్ను ప్రేమగా ఆత్మీయంగా చూసుకోవాలని నేనూ శ్రీధర్ అనుకోని రోజు ఉండదు. నీ భర్త అనే మగాడు నీకేమాత్రం సుఖసంతోషాలు పంచిచ్చినా నీలో ఈ పశ్చాత్తాపం ఉండేదా! మమ్మల్ని క్షమించమని అడిగేదానివా? పైగా నీకేం తక్కువని గుడ్డివాడ్ని చేసుకున్నావ్ అని నన్నే దుమ్మెత్తిపోసేదానివి. పుణ్యం కొద్దీ పురుషుడు దానంకొద్దీ బిడ్డలు అన్నట్టు ఈ సత్పురుషునితో ముడిపడింది నా జీవితం. నిజంగా నువ్ దురదృష్టవంతురాలివే. లోకంలో ఎంతమంది మంచివాళ్ళు లేరు. ఏవో చిన్న చిన్న పొరపొచ్చాలున్నా మొగుడూ పెళ్లాలెంతమంది అన్యోన్యంగా బ్రతకడం లేదు. నా ఖర్మ దీని మనసును బట్టే ఇలాంటి వాడు దొరికాడు దీనికి అని బాధపడుతూనే ఉంటారు మీ అమ్మ''

తన తల్లి ప్రస్తావన వచ్చేసరికి ఒక్కసారిగా శరీరం జలదరించింది నీలవే ణికి. "అమ్మ. మా అమ్మ ఇప్పుడెక్కడుందో నీకు తెలుసా షీలా?" ఆవేశంగా అంది.

"చెప్పాను కదే. మా ఆయన పుణ్యమూర్తి. వృద్ధులకీ, అంధులకీ ఒక ఆశ్రమం నెలకొల్పారు. ఆ సంస్థ కోసమే మా ఆస్తినంతా ఖర్చుచేస్తున్నారు. జబ్బు పడగానే మీ అమ్మని మా ఆశ్రమంలో చేర్పించారు మీ మామయ్య. మీ అన్నయ్య సంగతి తెలిసిందేగా. ఇప్పుడు మీ అమ్మ మా దగ్గర హేపీగా ఉంటు న్నారు"

"పోనీలే. నేనంత మూర్ఖంగా ప్రవర్తించినా మా అమ్మకు మీరు నీడని చ్చారు. ఈ మాత్రం అదృష్టానికైనా అమ్మ నోచుకుంది. మా అమ్మకు నువ్వే కూతురివి. శ్రీధర్ గారే కళ్లల్లో పెట్టి చూసుకునే అసలైన అల్లుడు. నేనే ఏమీ కాకుండా పోయాను" కరుడుకట్టిన దుఃఖంతో దిగ్గున లేచింది నీలవేణి.

"అలా ఎందుకంటావ్. నిన్ను తలుచుకుని మీ అమ్మగారు బాధపడని రోజులేదు. ఆమెకు పంచప్రాణాలు నువ్వే. నిన్ను చూస్తే ఆవిడెంత సంబరప డిపోతుందో"

"ఇంటి కబుర్లు నాకు చెప్పకు షీలా. తల్లిప్రేమను కాలదన్నుకున్నాను. నా స్వార్థానికి అమ్మ బలైపోయింది. ఇంత పాపాత్మురాల్ని నన్ను అమ్మ అభిమా నిస్తుందని కలలో కూడా అనుకోలేను"

"పిచ్చి నీలా! చెప్తున్నాను కదే. నిన్నావిడ అసహ్యించుకోవడం లేదు. నీ మీద ద్వేషం అంతకన్నా లేదు. నువ్వు కళ్లపడగానే గుండెకు హత్తుకుని పరవ శించిపోతుంది. ఏవేవో ఆలోచనలతో మనసు పాడుచేసుకోకు. త్వరలో నువ్ మీ అమ్మను చూడబోతున్నావు. ఆ ఏర్పాట్లన్నీ నే చూస్తాగా" స్నేహితురాల్ని ఊరడించి భర్త చేయందుకుని వెళ్ళిపోయింది. ఆరోజు రానే వచ్చింది. షీలా పుణ్యమా అని కన్నతల్లిని కళ్లనిండా చూసుకుంది.

"నాలాంటి కూతురు ఏ తల్లికీ ఉండకూడదమ్మా. నువ్ నాకోసం ఎంత శ్రమించినా అదేం పట్టనట్టే ఉండేదాన్ని. పెళ్ళి చేసి పీడ వదిలించుకుంటు న్నావ్ అనుకున్నానే గానీ నా జీవితానికో స్థిరత్వాన్ని ఇవ్వాలని నువ్ చేసిన ప్రయత్నాన్ని అర్థం చేసుకోలేదు సరికదా నిన్ను శత్రువులా భావించాను. నా పంతం నెగ్గాలని ధనవంతుణ్ణి కట్టుకున్నాను. నా మోజులన్నీ తీర్చుకుని నిన్ను నిరుపేదను చేసి ఆశ్రమాల పాలు చేశాను. నేనెంత బాధపడుతున్నానో మాటల్లో చెప్పలేనమ్మా" తల్లిని కౌగిలించుకుని అంది.

సుభద్రమ్మ పేలవంగా నవ్వి- "నాకోసం నువ్వేం బాధపడనక్కర్లేదు. నీ బ్రతుకిలా బండలయిందని మేమంతా బాధపడుతున్నాం" కాస్త కటువుగా కూతురు మాటను తిప్పికొట్టింది.

నీలవేణికి ఏం మాట్లాడాలో తోచలేదు. మళ్లీ ఆవిడే అందుకుంది.

"నిజానికి మగాళ్లంతా నీ మొగుళ్లలాగే ఉంటే ఆడాళ్లంతా ఇంత ఉన్నతస్థి తికి చేరుకొనగలిగే వారు కాదు. దర్జాగా బ్రతకగలిగేవాళ్ళూ కాదు. నీ విష యంలో నేనొక్కటే అనుకుంటాను. శ్రీధర్ మనస్సు గాయపరిచావు. అంధుడని అతన్ని అవమానించావ్. వికలాంగుల పట్ల నీకున్న చిన్నచూపుకు ఆ దేవుడే నిన్ను శిక్షించాడు"

"అక్షరసత్యాలు చెప్పావమ్మా. నా పాపానికి నిష్కృతి లేదు" వెక్కి వెక్కి ఏడుస్తూ అంది నీలవేణి. స్నేహితురాలికి ఇవ్వడానికి పట్టుచీర పసుపుకుంకు మలు పళ్లెంలో పెట్టుకుని వచ్చిన షీలా-

"అదేవిటమ్మా! నువ్ దగ్గరుండి తనని ఏడిపిస్తున్నావా! తల్లి ఓదార్పు జీవి తకాలానికి సరిపోయే ధైర్యాన్ని ఇస్తుందని నీ దగ్గరికి తీసుకొస్తే"

"నువ్వేమను షీలా. దీని ముఖం చూసేసరికి నాలుగు దులిపేయాలని అని పించింది"

"నువ్వలా అనడం భావ్యం కాదమ్మా. శంకరంలో మార్పు రావాలని, నీలూ ఆనందమయజీవితం గడపాలని ఓ వైపు కోరుకుంటున్నావ్. ఇలా మాటలతో తనని చిత్రవధ చేస్తావెందుకు? శంకరాన్ని ఓ దారికి తెచ్చి తీరతా నంటున్నాడు శ్రీధర్. తాగుడు, చెడ్డ అలవాట్లన్నీ మానిపించి తీరతారు. మా ఆయన పట్టుపట్టారంటే ఓ పట్టాన వదలరు. శంకరం చేయబోయే వ్యాపారా నికి ఈయన పెట్టుబడి పెట్టబోతున్నారు. దుర్వ్యసనాలతో ఉన్నదంతా ఆర్పేశా డుగా మా ఆయన చేయూతతో పైకొచ్చాడంటే ఆయన సంస్కారమే అబ్బు తుంది"

నీలవేణి కళ్ళు మెరిశాయి.

"నిజం నీలూ! నీ బాగోగులు మేం చూసుకుంటాంగా. నువ్ కిలకిలా నవ్వే దాకా నీ ప్రాణస్నేహితురాలి మనసు కుదుటపడుతుందా"

నీలవేణి పెదాలపై చిరునవ్వు.

"అదీ. ఇలా నిన్నెప్పుడూ నవ్వు ముఖంలోనే చూడాలి" బొట్టుపెట్టి పళ్లెం నీలవేణి చేతుల్లో ఉంచింది షీలా.

☆



## ప్రాధాన్యత

ఒకేసారి రెండు చిత్రాలు మంచి హిట్ సాధిస్తే అందులోని తారలెవరైనా ఆనందంగా ఉండక ఎలా ఉంటారు చెప్పండి? ఇప్పుడు సెక్సీ సైరన్ బిపా షాబసు అలాగే ఉంది. బర్సాత్, నో ఎంట్రీ చిత్రాలు హిట్ సాధించడంతో ఆమె చాలా హేపీగా ఉంది. లారాదత్తా, ప్రియాంకాచోప్రాల అవకాశాల్ని కూడా ఈమె తన్నుకుపోతోంది. ఇంతకుముందు మల్లికా షెరావత్‌కి ఇచ్చే ప్రాధాన్యతని బిపాషా ఇప్పుడు పొందుతోంది. ఐశ్వర్యారాయ్‌తో కలిసి నటించడం తనకి ఇష్టమేనంటోంది బిప్.

